గ్లోబల్ సంస్థ టెండర్లను రద్దు చేయాలి

చౌటుప్పల్ డివిజన్ ఆఫీసు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్కట్రికల్ అసోసియేషన్ నాయకులు

చౌటుప్పల్, నవంబర్ 12 : విద్యుత్ శాఖ కాంట్రాక్టు పనుల్లో గ్లోబల్ సంస్థ టెండర్లను రద్దు చేయాలని చౌటుప్పల్ డివిజన్ ఎల్కట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిమల్ల జానయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్లోబల్ సంస్థ టెండర్లకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని డివిజన్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ సంస్థలో సుమారు 500మంది కాంట్రాక్టర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. నష్టాలను భరించి కూడా విద్యుత్ శాఖ అనుబంధంగా పనిచేశారని గుర్తు చేశారు. గ్లోబల్ టెండర్లతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్లోబల్ టెండర్ విధానాన్ని రద్దు చేసి సామాన్య కాంట్రాక్టర్లకు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు దాసరి లింగయ్య, పెద్దిటి దామోదర్‌రెడ్డి, చిన్నపాక శ్రీకాంత్, మోదుగు నాగిరెడ్డి, దేవరపల్లి వెంకట్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్, నాగేశ్, యాదయ్య, రవికుమార్, శ్రీకాంత్, కరుణాకర్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటయోధుడు యాదగిరిగౌడ్‌కు సన్మానం

యాదగిరిగౌడ్‌ను సన్మానిస్తున్న తాసీల్దార్ రవికుమార్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 12 : మండలంలోని పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు బత్తిని యాదగిరిగౌడ్‌ను తాసీల్దార్ రవికుమార్ మంగళవారం సన్మానించారు. తాసీల్దార్ మంగళవారం గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా యాదగిరిగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటయోధులు, స్వాతంత్ర్య పోరాటయోధుల త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తి కావాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

ఈ నెల 15న కార్తిక పౌర్ణమి జల దీపోత్సవం

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 12 : పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో లక్ష్మీనారాయణస్వామి భజన మండలి 28వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 15న సాయంత్రం 6:05 గంటలకు కార్తిక పౌర్ణమి జల దీపోత్సవం నిర్వహించనున్నట్లు భజన మండలి అధ్యక్షుడు బత్తుల మహేశ్, ప్రధాన కార్యదర్శి బోడ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఆలయంలో మేలుకొలుపు ధ్వజారోహణం, యజ్ఞం, అభిషేకాలు, శతనామావళి పూజ, కుంకుమార్చన, నైవేద్య నివేదన, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేసేవరకు ఉద్యమిస్తాం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

చౌటుప్పల్, నవంబర్ 12 : కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేసేవరకూ ఉద్యమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అన్నారు. పట్టణంలోని జయశ్రీ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులు ప్రధాని మోదీ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలకవర్గాలు, కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారిందని విమర్శించారు. 44కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులపై దాడి చేయిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, నాయకులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, గోద శ్రీరాములు, ఎం.నర్సింహ, పల్లె శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో క్షుద్ర పూజలు

మోత్కూరు, నవంబర్ 12 : మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించారు. దీనిని మంగళవారం ఉదయం మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన వాకర్లు గమనించారు. కళాశాలలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తుంది. పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, పచ్చి మిరపకాయల తోపాటు క్షుద్ర పూజలకు ఉపయోగించే వస్తువులు అక్కడ పడి ఉన్నాయి. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాజస్టిస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

'ఆత్మజ్ఞాన సదస్సును విజయవంతం చేయండి'

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 12 : పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించే ఆత్మజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, ఉపాధ్యక్షులు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్ తెలిపారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జగద్గురు మఠం వేదాంత ఆచార్య విద్యావారధి సంపూర్ణానందగిరిస్వామి, కృష్ణా జిల్లా పెనమలూరు జ్ఞాన సరస్వతీ పీఠం ప్రకాశానంద సరస్వతి స్వామి హాజరు కానున్నారని తెలిపారు. శ్రీమద్భగవద్గీత ఆత్మ సంయమ యోగం ఆరవ అధ్యాయంపై ప్రవచనాలు జరుగుతాయన్నారు. సమావేశంలో భక్త సమాజం ప్రతినిధులు కటకం తుకారం, పుప్పాల నాగేశ్వర్, సీత సత్యనారాయణ, సీతారాములు, చిట్టిపోలు గోవర్ధన్, రుద్ర వెంకటయ్య, గంజి బాలయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వలిగొండ, నవంబర్ 12 : మండలంలోని వెల్వర్తి, పులిగిల్ల గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని వెల్వర్తి, పులిగిల్ల, కంచనపల్లి, గోలిగూడెం గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జె.నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణ పనులు చేపడుతున్నందున ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

అయ్యప్ప మహా పడిపూజ బ్రోచర్ ఆవిష్కరణ

భువనగిరి అర్బన్, నవంబర్ 12 : పట్టణంలోని శబరినగర్‌లో హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవ బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఐతరాములు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 16నుంచి జనవరి 14వరకు నిత్యన్న ప్రసాద వితరణ, గణపతి హోమం, నవాభిషేకాలు, అష్టాదశ కలశాభిషేకం, నిత్యపూజ, గోపూజ, పడిపూజ, సాయంత్రం అష్టాదశ కలశపూజ, పల్లకీ సేవ, హరివరాసనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన

స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, నవంబర్ 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు సహస్రనామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలను పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం సుమారు రెండు గంటలపాటు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వెండి మొక్కు జోడు సేవలో భాగంగా సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి సేవను తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. రాత్రి ఆలయ ముఖ మండపంలో దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శయనోత్సవ సేవ నిర్వహించి ద్వారబంధనం గావించారు. కార్తిక మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే మహిళలు దీపారాధనలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ ఘనంగా జరిగింది. ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి పూలమాలలతో అలంకరించారు. వెయ్యి తమలపాకులతో సహస్రనామార్చన జరిపి, వడ పప్పు, బెల్లం నైవేద్యంగా సమర్పించారు. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.28,75,384 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వర్ణతాపడానికి రూ.5లక్షల విరాళం

స్వామివారి విమానగోపురం స్వర్ణతాపడానికి దాతలు రూ.5లక్షల విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రాగాల శివశాంత్, రాగాల శ్రీనివాస్, రాగాల చారిటబల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాగాల ఆర్‌కే జ్ఞాపకార్థం విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం ఆలయంలో ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు.

240 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

- రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు

రెడ్లరేపాకలో ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్న పీడీఎస్ బియ్యం

వలిగొండ, నవంబర్ 12 : అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని ఎస్ఓటీ పోలీసులు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. 240 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించి మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. పోలీసులు, పౌరసరఫరాల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్లరేపాక గ్రామ పరిధిలోని శ్రీవీరాంజనేయ బిన్నీ మిల్లు యజమాని పంతంగి రాజు కొంత కాలంగా పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున మిల్లుపై దాడి చేశారు. భారీ ఎత్తున ప్లాస్టిక్ బ్యాగుల్లో కుట్టేసి ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించారు. పోలీసుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి రామన్నపేట పౌరసరఫరాల గోదాముకు తరలించారు. పంతంగి రాజు వివిధ గ్రామాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామని ఎస్ఐ యుగంధర్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామన్నపేట పౌరసఫరాల అధికారి బాలమణి, టెక్నికల్ టీమ్ సభ్యుడు రసూల్ పాల్గొన్నారు.

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 5వరకు ఇంటింటికీ సీపీఎం

- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జహంగీర్

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి అర్బన్, నవంబర్ 12 : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా మూడవ మహాసభల సందర్భంగా నవంబర్ 15నుంచి డిసెంబర్ 5వరకు ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన చిన్న నీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. ఒక వైపు మూసీ, మరోవైపు పరిశ్రమల కాలుష్యం జిల్లాను పట్టి పీడిస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో సీపీఎం జిల్లా మహాసభలు చౌటుప్పల్‌లో డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకే నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకొని భవిష్యత్తులో చేయబోయే పోరాటాలకు శ్రీకారం చుడుతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నరసింహులు, మాటూరి బాలరాజు, దోనూరు నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, నాయకులు సిర్పంగి స్వామి, మద్దెల రాజయ్య పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్ : బీఆర్ఎస్

భువనగిరి కలెక్టరేట్ : చందుపట్లలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 12 : ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తుందని బీఆర్ఎస్ నాయకుడు కొలుపుల అమరేందర్ అన్నారు. మండలంలోని చందుపట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యానికి రూ.500 బోనస్, ఎకరానికి ఏడాదికి రూ.15వేల రైతు భరోసా ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కల్లాల్లో ఉన్న వడ్లను తొందరగా కొనుగోలు చేసి రైతు భరోసా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు కంచి మల్లయ్య పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రైలు కింద పడి గుర్తు తెలియని ఇద్దరు మృతి

భువనగిరి అర్బన్/ బీబీనగర్, నవంబర్ 12 : వేర్వేరు చోట్ల రైలు కింద పడి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి – పగిడిపల్లి రైల్వేస్టేషన్ మధ్య కిలోమీటర్ నంబర్ 237/11-09 మైలు రాయి వద్ద ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని ఓ వ్యక్తి మరణించాడు. మృతుడి వయస్సు సుమారు 30ఏండ్లు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, ఘట్‌కేసర్ – బీబీనగర్ రైల్వేస్టేషన్ మధ్య కిలోమీటర్ నంబర్ 225/20-22 మైలు రాయి వద్ద గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మరణించాడన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, క్రీమ్ కలర్ షర్ట్, కాఫీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. మృత దేహాలను భువనగిరి ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచామన్నారు. మృతుల వివరాలు తెలిసినవారు 9848222169, 8712568454 నెంబర్లలో సంప్రదించి సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి డీసీఎంకు మంటలు

వలిగొండ, నవంబర్ 12 : మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామ సమీపంలో మంగళవారం విద్యుత్ వైర్లు తగిలి వరి గడ్డి తరలిస్తున్న డీసీఎంకు మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్తులు రామన్నపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో గడ్డి తగలబడిందని, డ్రైవర్‌కు, వాహనానికి ఎటువంటి ప్రమాదం జరుగలేదని ఫైర్ సిబ్బంది గోపాల్ తెలిపారు.

జనంపల్లిలో వరుస దొంగతనాలు

రామన్నపేట, నవంబర్ 12 : మండలంలోని జనంపల్లి గ్రామంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి జనంపల్లి గ్రామానికి చెందిన నక్క చిన్నరుక్కయ్య వ్యవసాయ బావివద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బుడ్లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును దొంగిలించారు. పది, పదిహేను రోజుల క్రితం ఏశబోయిన రవికి చెందిన రెండు మేకలు, కోనేటి యాదయ్యకు చెందిన నాలుగు మేకలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకొని వెళ్లారు. గ్రామంలోని కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఉన్నా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

- టీజీఓ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌ప్రసాద్

కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 12 : వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడి హేయమైన చర్య అని టీజీఓ జిల్లా అధ్యక్షుడు సి.జగన్‌మోహన్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్, ఉద్యోగులపై జరిగిన దాడిని ఖండిస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి జరిపిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీకాంత్, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు రామారావు, సైదులు, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి శ్యామేల్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి మోహన్‌కుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు సోమేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

యాదగిరిగుట్ట : వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా డిమాండ్ చేశారు. దాడిని వ్యతిరేకిస్తూ తాసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మెజిస్ట్రేట్‌పై దాడులు జరుగడం దురదృష్టకరమన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. డీటీ నర్సింహారావు, ఆర్ఐ విజయసింహారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

రాజాపేట : ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్‌పై దాడిని నిరసిస్తూ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ దామోదర్, డిప్యూటీ తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు నరసింహులు, రమేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : తాసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, సీనియర్ అసిస్టెంట్ శోభ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా, ఉద్యోగులు

మోత్కూరు : కొడంగల్‌లో కలెక్టర్, తాసీల్దార్‌పై దాడికి నిరసనగా రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఉపేందర్, కృష్ణ, వీరన్న, మత్స్యగిరి పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : తాసీల్దార్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఆఫీసు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామానికి వచ్చిన అధికారులపై దాడి చేయడం శోచనీయమన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

యాదగిరిగుట్ట : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

యాదగిరిగుట్ట/ ఆలేరు టౌన్, నవంబర్ 12 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అత్యంత పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి, మండలంలోని వంగపల్లి, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో సర్వే నిర్వహణ తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు సర్వే చేసే విధానాన్ని, అడిగే ప్రశ్నల తీరును, సర్వే ఫామ్‌లో కుటుంబాల వివరాల నమోదును పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ తప్పులు లేకుండా కుటుంబాల వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గుడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ కమిషనర్ లక్ష్మి, మేనేజర్ శారద పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

కొల్లూరులో ధాన్యం తూకం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు రూరల్, నవంబర్ 12 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని కొల్లూరు, ఆలేరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంతోపాటు రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా పడేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యాన్ని ఏరోజుకారోజు మిల్లులకు తరలించాలన్నారు. తాసీల్దార్ అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్, ఏఓ శ్రీనివాస్, ఏఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువుల ఉత్పత్తి

- డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్

దాచారంలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్

మోత్కూరు, నవంబర్ 12 : కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పాడి పశువుల ఉత్పత్తి పెరుగుతుందని నల్లగొండ డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని దాచారంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స వైద